సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 29 | జూలై | 2023



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో▶



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29^0 /25^0

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

కన్నీరే మిగిలింది..

మోరంచపల్లి వాసుల బాధ వర్ణనాతీతం

- నిండా ముంచిన వరద
- ఇంట్లోని వస్తువులన్నీ తడిసి ముద్దయిన వైనం
- వరదలో కొట్టుకుపోయిన కార్లు, బైకులు, మూగజీవాలు
- రూ.కోట్లలో ఆస్తి నష్టం
- ఇంకా లభించని నలుగురి ఆచూకీ..

భూపాలపల్లి అర్బన్ /భూపాలపల్లి రూరల్: ఇంట్లోని వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి.. బియ్యం, బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి.. మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి.. కట్టు బట్టలు.. మొండిగోడలు తప్పా వారికి మరేం మిగలలేదు. ఇదీ భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామ వరద బాధితుల పరిస్థితి. వారికి కదిలిస్తే కన్నీరు ఆగడం లేదు. మోరంచపల్లిలో రూ.కోట్లలో ఆస్తినష్టం జరిగింది. శుక్రవారం మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్, కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణరావు గ్రామస్తులను పరామర్శించి ఓదార్చారు.

మోరంచపల్లి గ్రామంలో 285 నివాస గృహాలు ఉన్నాయి. 320 కుటుంబాల్లో 1,291 మంది నివసిస్తున్నారు. గ్రామంలో ఏ ఇల్లు చూసి మూడు నాలుగు మీటర్ల ఎత్తు వరకు నీరు చేరుకొని ఇంట్లో ఉన్నటువంటి వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఇల్లు వ్యవసాయ ఆధారిత కుటుంబమే. ప్రతీ ఇంట్లో 5నుంచి 20 వరకు బియ్యం, వడ్ల బస్తాలు నిల్వ ఉన్నాయి. విలువైన టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, సెల్‌ఫోన్లు, కూలర్లుతో పాటు బట్టలు, నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్, స్టౌవ్‌లు తడిశాయి. పడుకునే మంచాలు, పరుపులు, సోపాసెట్లు పనికి రాకుండా పోయాయి. మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. కొంతమంది వస్తువులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. వండుకోవడానికి గిన్నెలు, తినడానికి ప్లేట్లు కూడా లేవు. బాధితులు గణపురం మండలం కర్కపల్లి, గాంధీనగర్‌లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్నారు.

రూ.లక్షల విలువ చేసే పాడి గేదెలు

గ్రామానికి చెందిన వారిలో 50శాతం మంది పాడి గేదెలను పెంచుకుంటూ పాడి సంపదను చేసుకుంటున్నారు. ఒక్కో గేదెకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ధర ఉంటుంది. గ్రామంలో 159 గేదెలు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.కోటిపైగా ఉంటుందని బాధితులు తెలిపారు. ఒక్కో ఇంటికి 5నుంచి 20గేదెలను పెంచుకుంటున్నారు. ఒక్కో గేదె ద్వారా నెలకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆదాయం వస్తుంది. గేదెలను కోల్పోవడం వలన తమకు ప్రతీ నెల వచ్చే ఆదాయం కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరికొంత మంది రైతుల గేదెలు ఉన్నప్పటికీ వాటికి కావాల్సిన గడ్డి పూర్తిగా తడిసిపోయింది. కొంత మేరకు గడ్డివాములు వరదలో కొట్టుకుపోయాయి.

చేపడుతున్న రోడ్డు నిర్మాణం..

మోరంచవాగు సమీపంలో కుందయ్యపల్లి నుంచి మోరంచపల్లి గ్రామం వరకు ఎనిమిది చోట్ల రోడ్డు తెగిపోయింది. వరద తాకిడికి మోరంచవాగుపై పాత బ్రిడ్జి కూలిపోయింది. అర కిలోమీటర్ మేరకు నాలుగు మీటర్ల ఎత్తు, వెడల్పుతో జాతీయ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. తెగిపోయిన రోడ్డును పునఃరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్, పోలీస్ అధికారులు రోడ్డు పనులు చేపడుతున్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ నుంచి లారీల ద్వారా మట్టిని తీసుకువచ్చి నింపుతున్నారు.

ఇళ్లలో మిగిలిన ఒండ్రు..

ప్రతీ ఇంటిలో మోకాలు లోతు ఒండ్రు వచ్చి చేరింది. ఇంట్లో చేరిన ఒండ్రును ఎత్తిపోసే పనిలో కుటుంబ సభ్యులు నిమగ్నమయ్యాయి. వరదలో కొట్టుకుపోగా మిగిలిన వస్తువులు కూడా ఒండ్రు మట్టిలో కలిసిపోయాయి.



తడిసి ముద్దయిన వస్తువులు, బియ్యం బస్తాలు

కొట్టుకుపోయిన కార్లు, ద్విచక్ర వాహనాలు

కార్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ట్రాలీలు, ఆటోలు ఎడ్ల బండ్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు వరదలో కొట్టుకుపోయాయి. కొంత మంది ధైర్యంతో వరదలోనే వారి ఇండ్ల ముందు ఉన్నటువంటి కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులను తాళ్లతో కట్టేశారు. దీంతో వరదలో కొట్టుకుపోకుండా కాపాడుకున్నారు. వరదలో కొట్టుకుపోయిన కొన్ని వాహనాలు గ్రామ సమీపంలో పొలాల్లో, చెట్లకు చిక్కుకుని ఉన్నాయి.





కనిపించని నలుగురి ఆచూకీ..







గడ్డం మహాలక్ష్మి, గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ

వరదల్లో కొట్టుకుపోయిన నలుగురిలో ఇద్దరు వృద్ధ దంపతులు ఉన్నారు. గొర్రె ఓదిరెడ్డి–వజ్రమ్మ దంపతులు గ్రామంలోని రేకుల షెడ్‌లో నివసిస్తున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో వరద ప్రవాహం ఉప్పొంగుతుండగా పక్కనే ఇంటిపైన స్లాబ్ ఎక్కేందుకు వస్తుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. గంగిడి సరోజన ఇంట్లో వస్తువులు సర్దుతుండనే కొట్టుకుపోయినట్లు సరోజన కూతురు కౌసల్య తెలిపింది. చేతితో అందుకునేలోపే కంటికి కనిపించకుండా పోయినట్లు కన్నీరుమున్నీరైంది. గడ్డ మహాలక్ష్మి తన చేతిలో నుంచే చేజారిందని మహాలక్ష్మి భర్త శ్రీనివాస్ తెలిపారు. తను కూడా అప్రమత్తం కాకపోతే భార్యతో పాటే పోయేవాడినని పక్కనే ఉన్నప్పటికీ కాపాడుకోలేకపోయినట్లు వాపోయారు. కళ్లు మూసి తెరిసే లోపే వరద పెరిగిందని ఉదయం 4గంటల నుంచి 11గంటల వరకు వరదలోనే బిక్కుబిక్కుమంటూ ఉన్నట్లు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో..

మోరంచపల్లి గ్రామానికి చెందిన ప్రజల సౌకర్యార్థం గణపురం మండలంలోని కర్కపల్లి ప్రభుత్వ పాఠశాల, గాంధీనగర్ సీఎస్ఐ స్కూల్‌లో పునరవాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పునరవాస కేంద్రాల్లో సుమారు 600మందికి భోజనాలు, టిఫిన్లు అందిస్తూ వారికి సౌకర్యాలు కల్పించారు. అధికారులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, పార్టీల నాయకులు పండ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేస్తున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూడా అందించారు.



భోజనాలు చేస్తున్న మోరంచపల్లి వాసులు



ఒండ్రు మట్టిలో మునిగిన వస్తువులు



కొట్టుకుపోయిన ఇంటి పునాదులు, గోడలు



గూడులో చనిపోయిన కోళ్లు



మల్హర్: మల్లారం అరెవాగు వద్ద తెగిన రోడ్డు

- మరిన్ని ఫొటోలు 9లో▶

నిలిచిన రాకపోకలు

- భూపాలపల్లి నుంచి పరకాల వెళ్లే ప్రధాన జాతీయ రహదారి మోరంచపల్లి వద్ద పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రెండు రోజులుగా పరకాల–భూపాలపల్లి రాకపోకలు నిలిపోయాయి.
- గణపురం మండలంలోని నగరంపల్లి, కొండపూర్, గాంధీనగర్ గ్రామాల నుంచి వేర్వేరుగా మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారులు తెగిపోయాయి. దీంతో పరకాల, ములుగు, భూపాలపల్లికి వెళ్లే రవాణా పూర్తిగా నిలిచిపోయింది.
- చిట్యాల మండలంలోని చిట్యాల నుంచి పరకాల వెళ్లే ప్రధాన రహదారిలో వెంకట్రావ్‌పల్లి సమీపంలోని మోడల్‌స్కూల్ వద్ద, జడల్‌పేట సమీపంలోని కాజ్‌వే వద్ద పూర్తిగా గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- మొగుళ్లపల్లి–నవాబుపేట రోడ్డు, ముల్కలపల్లి– కోర్కిశాల రోడ్డు, అంకుషాపూర్–మేదరమెట్ల రోడ్డు, రంగాపూర్–ఇస్సిపేట మధ్యగల రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలను తీవ్ర అంతరాయం కలుగుతుంది.
- టేకుమట్ల–రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య నిర్మించిన వంతెన వరద ఉధృతికి కూలిపోయింది. సమీప గ్రామాలైన గుమ్మడవెల్లి, రామకృష్ణపూర్, ఏంపేడు, గ్రామాలకు టేకుమట్ల మండల కేంద్రానికి రాకపోకలు పూర్తిగా నిలిపోయాయి.
- రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి తెగిపోవడంతో మండల కేంద్రానికి రాకపోకలు బంద్ అయ్యాయి. జూబ్లీనగర్ వద్ద లోలెవల్ కల్వర్టు ధ్వంసమైంది.
- మల్హర్ మండలంలోని మల్లారం అరెవాగు వంతెన నుంచి ఇప్పల క్రాస్ వరకు రెండు చోట్ల రోడ్డు తెగిపోయింది. దీంతో కొయ్యూరు–మల్హర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

చెరువులకు గండ్లు

గణపురం మండలంలోని ధర్మరావుపేట చెరువుకు ఐదు గండ్ల పడగా వంగపల్లి బుంగ పడటంతో గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో మత్తడి వద్ద కొంత ఎత్తును జేసీబీ సహాయంతో తొలగించారు. రేగొండ మండలలోని కొనరావుపేట, చిన్న కొడేపాక చెరువుకు గండిపడింది,

15 పునరావాస కేంద్రాలు..

- జిల్లాలో 15 పునరవాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1500మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు.
- చిట్యాల మండలంలోని ముచీనిపర్తిగ్రామ సమీపంలోని వెంకటేశ్వర్ల గ్రామానికి నీరు చేరడంతో సమీప గ్రామంలో ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రానికి గ్రామస్తులను తరలించారు.
- టేకుమట్ల మండలంలోని చలివాగు ప్రభావిత గ్రామాలైన ఏంపేడు, సుబ్బక్కపల్లి, గుమ్మడివెల్లి, రామకృష్ణాపూర్ గ్రామాల్లోని ఇళ్లలోని వరద నీరు రావడంతో అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలను తరలించారు.
- మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామ శివారులోని పూసుకునిపల్లి గ్రామాన్ని అధికారులు ముందస్తుగా ఖాళీ చేయించారు. అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

మా అమ్మను కాపాడిన..



మోరంచపక్కనే మా ఇల్లు ఉంటుంది. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. ఇంట్లోకి వరద నీరు రావడంతో బయటికి వచ్చి డాబాపైన కూర్చున్నాం. డాబాపైకి వెళ్తున్న క్రమంలో మా అమ్మ వరదలో కొట్టుకుపోతుండగా చేతితో అందుకొని కాపాడుకున్నాను. మా కారు, ద్విచక్ర వాహనం వరదలో కొట్టుకుపోయాయి. ఇంట్లో వస్తువులు కూడా చాలావరకు వరద తాకిడికి పోయాయి.

- బత్తుల భరత్‌కుమార్

నెలకు రూ.15వేలు వచ్చేది..



మాకు 3 గేదెలు, రెండు దుడ్డెలు ఉన్నాయి. వరద కారణంగా అన్నీ చనిపోయాయి. మూడు కొట్టుకుపోగా.. రెండు ఇంటి వద్దనే తలుగుకు చనిపోయి ఉన్నాయి. పాలతో నెలకు రూ.15వేల ఆదాయం వచ్చేది. చనిపోయిన గేదెల విలువ ఒక్కో దానికి రూ.80వేల వరకు ఉంటుంది. ఇంట్లో వస్తువులు కూడా కొట్టుకుపోయాయి. కట్టుబట్టలతో ఉన్నాం. గడ్డివాము కూడా కొట్టుకుపోయింది.

- శ్రీపతి రమ

ఇల్లు దెబ్బతింది ..



అత్యంత నాణ్యతతో నిర్మించిన ఇల్లు వరద కారణంగా దెబ్బతిన్నది. తీవ్రమైన వరద రావడంతో ఒత్తిడికి ఇంటి కింద భూమిలో నుంచి వరద చొచ్చుకుపోయింది. దీంతో ఇంటి పునాది, బెస్‌మెంట్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఇల్లు ఇప్పుడు పిల్లర్ల మీదనే ఆగింది. ఇంటి తలుపులు కూడా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం సాయం చేయాలి. ప్రాణాలను కాపాడుకోవడానికి ఇంటిపైకి ఎక్కి కూర్చున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఉదయం 10గంటల వరకు భయం గుప్పిట్లో బతికి బయటపడ్డాం.

- కొత్త సుదర్శన్‌రెడ్డి

కట్టుబట్టలతో బయటికొచ్చాం..



ఒక్కసారిగా వరద రావడంతో భయం గుప్పిట్లో ఉండి బయటపడ్డాం. ఇంటి సజ్జపైకి ఎక్కి ప్రాణాలను రక్షించుకున్నాం. ఇంట్లో వస్తువులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. బట్టలు పూర్తిగా బురదలో కలిశాయి. పండ్ల దుకాణం, తోపుడు బండి కూడా వరదలో కొట్టుకుపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- రక్తాని లక్ష్మి

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు

- 8లో▶

బిక్కుబిక్కుమంటూ గడిపాం

మిన్నంటిన రోదనలు

అన్ని విధాలా ఆదుకుంటాం..

మంత్రి సత్యవతి రాథోడ్



భూపాలపల్లి రూరల్: వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మహిళా, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లాలో భారీ వరదల నేపథ్యంలో శుక్రవారం బాధితులను మంత్రి సత్యవతి రాథోడ్, జిల్లా ప్రత్యేక అధికారి గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటమణరెడ్డి–జ్యోతి దంపతులతో కలిసి పరామర్శించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ మోరంచ గ్రామం తీవ్రంగా దెబ్బతిందని, భూపాలపల్లి జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వర్షం పడిందన్నారు. సంవత్సరం మొత్తం పడాల్సిన వర్షం ఒకేరోజు పడటం వల్ల, ఎవరి ఊహలకు అందని విధంగా గ్రామం ముంపునకు గురైందన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికార యంత్రాంగం అప్రమత్తమై రెస్క్యూ బృందాలను ఏర్పాటుచేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. గల్లంతైన నలుగురి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలిస్తున్నాయన్నారు. మోరంచ గ్రామంలో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గ్రామస్తులకు ఆర్థిక సహాయం అందే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మంత్రి హామీఇచ్చారు.

బాధితులకు అండగా కేంద్రం

బాధితులకు ఈటల పరామర్శ



భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ నేత, మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం రాత్రి మోరంచపల్లి గ్రామాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డితో కలిసి సందర్శించి గ్రామస్తులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బీభత్సంలో నిరాశ్రయులైన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు..

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: బాధితులకు అండగా ఉంటామని.. అధైర్య పడొద్దని ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు, గణపురం జెడ్పీటీసీ గండ్ర పద్మ అన్నారు. పునరావాస కేంద్రాలను వారు సందర్శించారు. నిరాశ్రయులకు దుస్తులు, దుప్పట్లతో పాటు. ఆహార పొట్లాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.50 వేలు అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

రేగొండ పోలీసులకు డీజీపీ అభినందనలు



ట్విట్టర్ ద్వారా పోలీసులను డీజీపీ అభినందనలు

టేకుమట్ల(రేగొండ): వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మోరంచ వాగు ఉప్పొంగి మోరంచపల్లి గ్రామం పూర్తిగా జల దిగ్బంధం కాగా ఎస్పీ పుల్ల కరుణాకర్, డీఎస్పీ రాములు ఆదేశాల మేరకు రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో పాటు, గ్రామ యువకులతో మోరంచపల్లిలో నిరంతరాయంగా సహాయక చర్యలు అందించారు. మూగజీవాలను సైతం రక్షించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసర సరుకులు అందించారు. రేగొండ పోలీస్ సేవలను గుర్తించిన డీజీపీ అంజన్‌కుమార్ రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సంతోష్, కృష్ణ, సతీష్, నేతాజీలను అభినందిస్తూ ట్విట్టర్‌లో షేర్ చేశారు.

గోదావరి మహోగ్రరూపం

- కాళేశ్వరం వద్ద 14.210 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- సరస్వతి, లక్ష్మీ బ్యారేజీల్లో గేట్లన్నీ ఎత్తివేత
- గోదావరి ఇన్‌ఫ్లో 10.30.. అవుట్ ఫ్లో 14.22 లక్షల క్యూసెక్కులు
- పంట చేన్లలోకి చేరిన వరద నీరు
- కాళేశ్వరం వద్ద ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం



కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

కాళేశ్వరం: తెలంగాణ–మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు నిండి గోదావరిలోకి వరద నీరు భారీగా చేరుతుంది. శుక్రవారం రాత్రి వరకు కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు మహోగ్రరూపం దాల్చాయి. కాళేశ్వరం వద్ద గోదావరి, మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న ప్రాణహిత నదులు ప్రమాదస్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 14.210 మీటర్ల ఎత్తులో నీటిమట్టం తీరాన్ని తాకుతూ ప్రవహిస్తుంది. అధికార యంత్రాంగం రెండో ప్రమాద హెచ్చరికలు దాటి ప్రమాదస్థాయిలో దిగువకు వెళ్తోంది. గతేడాది జూలై 14న కాళేశ్వరం వద్ద 16.900 మీటర్ల ఎత్తులో నీటిమట్టం నమోదైన విషయం తెలిసిందే.

అన్నారం, మేడిగడ్డ గేట్లన్నీ ఎత్తివేత

ఎగువ ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరుతుండడంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి), మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీల్లో గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. సరస్వతి బ్యారేజీకి ఎగువ గోదావరి నుంచి 8,9,0305 లక్షల క్యూసెక్కులు, మానేరు గుండా 1,4,0280 లక్షల క్యూసెక్కుల వరద తరలివస్తుంది. దీంతో బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 10,30,585 లక్షల క్యూసెక్కులు, బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని 10,30,585 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో తరలిస్తున్నారు. వరద నీరు దిగువన కాళేశ్వరం వైపునకు చేరుతుంది. అక్కడ మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో కలిసి నీరు మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి పోటెత్తింది. ఆ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 14,22,770 లక్షల క్యూసెక్కులు తరలివస్తుంది. బ్యారేజీలో మొత్తం 85 గేట్లన్నీ ఎత్తి 14,22,770 లక్షల క్యూసెక్కులు దిగువకు తరలిస్తున్నారు.

లక్ష్మీపంపుహౌస్ వద్దకు నీరు!

కాళేశ్వరం సమీపంలోని లక్ష్మీపంపుహౌస్ వద్దకు ఫోర్‌బే వరకు వరద నీరు చుట్టినట్లు తెలిసింది. గతేడాది 107 మీటర్లకు చేరగా ప్రస్తుతం 104.5మీటర్ల వరకు వరద నీరు ప్రవహిస్తుంది. గతేడాదిలా వరద పెరిగితే ప్రమాదం పొంచి ఉందని సమాచారం. ఇంజనీరింగ్ అధికారులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. బయటికి ఎలాంటి విషయాన్ని తెలియనివ్వడం లేదు.

పంట చేనుల్లోకి వరద

గోదావరి తీరప్రాంతంలోని మహదేవపూర్, కాటారం, పలిమెల మండలాల్లోని పంట చేనుల్లోకి వరదనీరు చేరింది. దీంతో పత్తి, వరి, మిర్చినారు నీటమునిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

- కలెక్టర్ భవేష్ మిశ్రా
- వరద నష్టం అంచనాపై నివేదిక తయారుచేయాలని ఆదేశం



సభ్యులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్: భారీ వరదల నేపథ్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. భూపాలపల్లి జిల్లాలో భారీ వరదల నేపథ్యంలో బాధితుల కోసం కరకపల్లి ప్రభుత్వ పాఠశాల, గాంధీనగర్‌లో సీఎస్ఐ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యంచెప్పి మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మోరంచపల్లి గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు పూర్తిచేసి రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిత్యావసర సరుకులు ప్యాకెట్ల రూపంలో బాధితులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చిట్యాల, రేగొండ, గణపురం మండలాలలో 24గంటల్లో 600 మిల్లీమీటర్లకు పైగా భారీ వర్షం పడిందని.. దీంతో వరంగల్–భూపాలపల్లి జాతీయ రహదారి రెండు మూడు చోట్ల దెబ్బతిందన్నారు. జాతీయ రహదారులు పంచాయతీ రోడ్లను తాత్కాలికంగా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టి 24గంటల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. మల్హర్, పలిమెల, మహాముత్తారం, మహదేవపూర్ మండలంలో కాటారం లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మోరంచపల్లిలో నలుగురు గల్లంతయ్యారని ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారని అన్నారు. ఈసందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద



కేటీపీపీ పంపుహౌస్ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్ కంట్రోల్ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు...

కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులుగా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు.

రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు



మొగుళ్లపల్లి : రంగాపూర్-ఇస్సిపేట రోడ్డు



గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు



దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు



నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

\- సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు



నయీంనగర్ : నయీంనగర్ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు



కమలాపూర్ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు



పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు



చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్ యార్డ్, వైకుంఠధామాలు



ములుగు : రోడ్డు వెంట ప్రవహిస్తున్న వరద



జవహర్ కాలనీలో వరద ముంపునకు గురైన మహ్మద్ ఖాదర్ పాషా గృహం



మల్హర్ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు



పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు



వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట



బచ్చన్నపేట : బొందుగల రోడ్డుపై తెగిన కల్వర్టు



మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్, గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు.



యాదవనగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్, కిషన్, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్ పరీక్షలకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్, ఐదేళ్ల 10వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు రూ.1360, బ్యాక్ లాగ్స్ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం



వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచే సరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..

హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్ కాలనీ-2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్, అనిల్ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, నాయకులు చింత రమేష్, పెద్ద రాజు, సయ్యద్ ఉమర్ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..



వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్ సూపర్ వైజర్ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే మడికొండ ఇన్‌స్పెక్టర్ 87126 85123, సబ్ ఇన్‌స్పెక్టర్ 87126 85248 నంబర్లలో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోర్బా-యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, రక్సోల్-సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు

కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం

కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు



అజహర్ మృతదేహం



మజీద్‌ఖాన్ మృతదేహం



షరీఫ్ మృతదేహం



రషీద్ మృతదేహం



కరీమా మృతదేహం



లాల్‌బీ మృతదేహం



సమ్మక్క మృతదేహం



మహబూబ్‌ఖాన్ మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్, కరీమా కుమారుడు రఫీక్ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఓఎస్డీ అశోక్, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్ ఏమైనా దెబ్బతిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం



మల్యాల, కొండాయి ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



నీటిలో మంచం మోసుకొస్తున్న బాధితుడు

- 24 గంటలు ప్రాణాలు అరచేతిలోనే
- నీట మునిగిన వందలాది ఇళ్లు

ఏటూరునాగారం : జంపన్నవాగు వరద, పెద్ద చెరువు పోటెత్తడం, జంపన్నవాగు వద్ద నిర్మించిన కరకట్ట తెగిపోవడంతో మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లోని ఇళ్లు నీట మునిగాయి. 24 గంటల పాటు వరద నీటిలోనే సుమారు 200 మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భవనాలు ఎక్కి తలదాచుకున్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలోకి కూడా వరద రావడంతో భవనం పైనే ఉండిపోయారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆ రెండు గ్రామాల్లో అనేక మంది ప్రజలు నానా అవస్థలు పడుతూ దేవుడిని వేడుకుంటూ బతికి బయటపడ్డారు. దళిత కాలనీలోని 40 ఇళ్లు నేలమట్టమయ్యాయి. అలాగే దొడ్లలో కూడా ఇళ్లు కూలిపోయాయి. ఇంకా మల్యాల, కొండాయి గ్రామాల్లో శుక్రవారం సైతం వరద నీరు ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.

బతుకుతామని ఆశ లేదు



పుట్టిననాటి నుంచి ఇప్పటి వరకు ఇంత వరద చూడలేదు. బతుకుతామని అనుకోలేదు. దేవుడి దయతో బతికి బయటపడ్డాం. మా బంధువులు చనిపోయారు. వరదలు తట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది.

\- అంకూస్‌బీ, కొండాయి వరద బాధితురాలు

భవనంపైనే ఉన్నా



రాత్రి అంతా భవనంపైనే ఉన్నా. మా ఇళ్లు కొండాయిలో ఉంది. వరద వస్తుందని మల్యాల ఆశ్రమ పాఠశాల భవనం పైకి ఎక్కి కూర్చొని ఉన్నా. నా ప్రాణాలను కాపాడుకున్నా. కానీ మా బంధువులు చనిపోయారు. దేవుడు అన్యాయం చేశాడు. చాలా భయంతో గడిపాం.

\- ఎండి సల్మాన్‌ఖాన్, కొండాయి